క్లుప్తంగా

రాజరాజేశ్వరీ దేవికి ఇత్తడి కిరీటం



కిరీటాన్ని చూపిస్తున్న ఈశ్వరరావు

సారవకోట: శ్రీకాకుళం ఇందిరానగర్ కాలనీలో ఉన్న రాజరాజేశ్వరీ దేవి అమ్మవారి విగ్రహానికి ఏర్పాటు చేసేందుకు రెండు కేజీల బరువుతో రూ.25 వేల విలువ గల ఇత్తడి కిరీటాన్ని ఆలయ కమిటీ సభ్యులు తయారు చేయించారు. కిరీటాన్ని సారవకోట మండలం చీడిపూడికి చెందిన కంచు, ఇత్తడి కార్మికుడు కింతాడ ఈశ్వరరావు తయారు చేశారు. దీని తయారీకి సుమారు 12 రోజులు పట్టిందని ఈశ్వరరావు తెలిపారు.

వెండి కిరీటం బహూకరణ

పాతపట్నం:మండలంలోని బూరగాం గ్రామంలో గల జడ్డమ్మతల్లి గ్రామ దేవతకు పాతపట్నంకు చెందిన ఒడియా ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ బరోడా వెండి కీరటాన్ని మంగళవారం అమ్మవారి కమిటీ సభ్యులకు అందజేశారు. దీని విలువ రూ.8 వేల ఉంటుందన్నారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం



తాగునీటిని ప్రారంభిస్తున్నన్న సర్పంచ్ చిన్నమ్మడు

జలుమూరు: అల్లాడపేటలో రెండు తాగునీటి బోరులను సర్పంచ్ కల్యాణం చిన్నమ్మడు మంగళవారం ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు రూ.రెండు లక్షలతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎంపీపీ వాన గోపికి కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కల్యాణం శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


లెప్రసీపై అవగాహన



ఆశ వర్కర్లను ప్రశ్నించి వివరాలు తెలుసుకుంటున్న తాడేల శ్రీకాంత్

నరసన్నపేట: గ్రామాల్లో లెప్రసీ, ఫైలేరియా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు డీఎంహెచ్ఓ తాడేల శ్రీకాంత్ అన్నారు. మండలంలోని మాకివలస పీహెచ్‌సీలో ఆశ వర్కర్లకు, ఏఎన్ఎంలతో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ రెండు వ్యాధులు ప్రస్తుతం అదుపులో ఉన్నాయన్నారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్, బ్రైట్ ఫ్యూచర్ డవలప్‌మెంట్ ట్రస్టు జిల్లా కో ఆర్డినేటర్ వంక వెంకటేశ్వరరావు, డాక్టర్ విజయ్, సూపర్ వైజర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఏఈ కృష్ణమూర్తి

పొందూరు: ప్రభుత్వం రాయితీతో గృహాలకు సోలార్ విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చిందని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎస్.కృష్ణమూర్తి అన్నారు. పొందూరు విద్యుత్ ఉపకేంద్రంలో మంగళవారం ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన కార్యక్రమంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడం ద్వారా గృహ వినియోగదారులకు తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందన్నారు. ఈ పథకానికి తక్కువ వడ్డీకే బ్యాంకు రుణం లభిస్తుందన్నారు. భవిష్యత్తులో సోలార్ విద్యుత్ వినియోగం బాగా పెరగనుందన్నారు. విద్యుత్ ఈఈ యోగీశ్వరరావు, డీఈఈ రమణమూర్తి, ఏఈ డి.రమణమూర్తి పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ కార్డుల పంపిణీ

సారవకోట: మండలంలోని బొంతు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గిరిజన గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో సికిల్ సెల్ ఎనీమియాపై సర్వే చేశారు. 0 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల 2071 మందికి సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. బొంతు పీహెచ్‌సీ పరిధిలో పరీక్షలు చేసిన వారిలో ఏ ఒక్కరికీ ఈ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ కాలేదని వైద్యులు సుస్మిత తెలిపారు. ఈ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన కార్డులు ప్రస్తుత ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిని త్వరలో 2071 మందికి అందజేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా దసరా వారాలు

కొత్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం దసరా వారాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు చల్లదనం చేసి మొక్కులు చెల్లించారు. రైతులు పత్రి కొమ్మలను అమ్మవారి ముందు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వీటిని తమ పొలాల్లో నాటారు.

● పరిశీలన



పొందూరు మండలంలో వ్యవసాయ, రెవెన్యూశాఖ నిర్వహిస్తున్న ఈ-పంట నమోదు, పొలం పిలుస్తోంది కార్యక్రమాలను జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మంగళవారం పరిశీలించారు. కనిమెట్టలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతులు పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని, పంట సంరక్షణకు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నారాయణపురం కాలువ ద్వారా అవసరమైన సాగునీరు సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సాగునీరు వెంటనే సరఫరా చేయాలంటూ ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి, ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ బెండి బాబ్జి, తహసీల్దార్ వెంకటేష్, హెచ్ఈఓ నీరజ, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

- పొందూరు

● నిబంధనలు తప్పనిసరి



బాణ సంచా దుకాణాలు పెట్టేవారు ప్రభుత్వ నిబంధనలు పాటించి, అమ్మకాలు చేయాలని, ప్రమాద జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జలుమూరు తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం హరికృష్ణమ్మపేట వద్ద ఏర్పాటు చేయనున్న బాణసంచా దుకాణాన్ని పరిశీలించి అనుమతి పత్రాలు సరి చూశారు. ఈ పరిశీలనలో నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, ఫైర్ అధికారి కె.పి.రెడ్డి, జలుమూరు ఎస్ఐ అశోక్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

- జలుమూరు

● కుంకుమార్చనలు



శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నరసన్నపేట కార్ స్టాండ్ వద్ద మంగళవారం కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. పరిసర గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సత్యవరాగ్రహారం గ్రామానికి చెందిన మావుడూరి జగదీష్ బాబు ఆధ్వర్యంలో కుంకుమ, ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్ స్టాండ్ కమిటీ ప్రతినిధులు కిరణ్, ముద్దాడ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

- నరసన్నపేట

పండగ వేళ.. భద్రం సుమా..

- పెరుగుతున్న దొంగతనాలు
- జాత్రలు పాటించాలని సూచిస్తున్న పోలీసులు



నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు



నరసన్నపేట: జిల్లాలో ఎన్నడూ లేనంతగా దొంగలు రెచ్చిపోతున్నారు. దసరా వేళ ఊళ్లకు వెళ్లేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఎస్పీ మహేంద్రరెడ్డి ఆదేశాల మేరకు నరసన్నపేట సర్కిల్ పరిధిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. నరసన్నపేటతోపాటు నాలుగు మండలాల్లో పోలీసుల పహారా బాగా పెంచినట్లు తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లేవారు ఉప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోపక్క వివిధ పద్ధతుల్లో సైబర్ నేరగాళ్లు డూప్లికేట్ ఐడీ కార్డులతో ప్రజలను మోసం చేసే అవకాశం ఉందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఈ సూచనలు పాటించాలి..

- డబ్బు, విలువైన ఆభరణాలు ఇంటిలో ఉంచి క్యాంపులకు వెళ్లవద్దు.
- రాత్రి వేళ అనుమానంగా సంచరించే వారి గురించి పోలీసులకు వెంటనే సమాచారం అందించాలి.
- తాళం వేసిన ఇళ్ల వద్దకు అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ వచ్చి పరసరాలను వెతికినట్లు కనిపిస్తే వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- విలువైన వస్తువులను పక్కంటి వారికి ఇచ్చి నమ్మి పోసపోవద్దు. ఇరుగు, పొరుగు వారిని తమ ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పి వెళ్లడం మంచిది.
- వీలైనంత త్వరగా ప్రయాణం ముగించుకుని వచ్చేలా ప్లాన్ చేసుకోవాలి. క్యాంపునకు వెళ్లే ఎప్పటికప్పుడు పక్కంటి వారినుంచి సమాచారం తెలుసుకోవాలి.
- ఖరీదైన వస్తువులు బ్యాంకు ల్యాకర్లలో ఉంచుకోవడం మంచిది.
- ఇంట్లో కుటుంబ సభ్యులు బయటకు వెళ్లేటప్పుడు.. ఇంట్లో ఉన్న మహిళలు, వృద్ధుల వద్దకు అపరిచిత వ్యక్తులు వచ్చి తమకు సమాచారం కాలావాలని, ఇతర మాయ మాటలతో వస్తే నమ్మవద్దు.
- కొత్తవారి కదలికలపై అనుమానితుల సమాచారం అందించి దొంగతనాల నివారణకు ప్రజలు సహకరించాలి.
- బయటకు వెళ్లేటప్పుడు తాళాలు ఒకటికి, రెండు సార్లు చెక్ చేసుకోవడం మంచిది.
- తాళాలు వేసి స్వగ్రామాలకు వెళ్లేవారు ఇంట్లో ఏదో ఒక రూమ్‌లో లైట్ వేసి ఉంచడం మంచిది.
- లాక్డ్‌హౌస్ మానటరింగ్ సిస్టం వినియోగించుకుని తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు చెక్ పెట్టండి.
- అవసరం లేకుండా వచ్చే మెసేజ్‌ల్లో బ్లూ కలర్ లింకులను ఓపెన్ చేయవద్దు.
- లాటరీ తగిలిందని, ఏదో గిఫ్ట్ వచ్చిందని కారు, బైక్ పేలిందని చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దు. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే 100కి సైబర్ నేరానికి గురైతే 1930 నంబర్‌కు కాల్ చేయండి.

తమ్మినేనికి అభినందనలు



తమ్మినేనికి అభినందనలు తెలుపుతున్న పిన్నింటి సాయికుమార్, తదితరులు

ఆమదాలవలస: మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ పరిశీలకునిగా నియామకం చేసిన సందర్భంగా రణస్థలం మండలానికి చెందిన పార్టీ నాయకుడు పిన్నింటి సాయికుమార్ మంగళవారం అభినందనలు తెలిపారు. తమ్మినేని ఆమదాలవలసలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రణస్థలం జెడ్పీటీసీ టి.సీతారాం, పార్టీ నాయకులు పిన్నింటి లక్ష్మణనాయుడు, చిన్న రామనాయుడు, రామ్ నాయుడు, విశ్వేశ్వరరావు, గొర్లె అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అండగా ఉంటున్నాం

- సత్యసాయి సేవా ట్రస్టు రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు



మాట్లాడుతున్న లక్ష్మణరావు

నరసన్నపేట: రాష్ట్ర వ్యాప్తంగా సత్యసాయి సేవా ట్రస్టులు సేవా కార్యక్రమాల్లో ముందుంటున్నాయని, వేలాది మంది అనాథలను ఆదుకుంటున్నామని సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక మారుతీ నగర్ మందిరంలో వంద గంటల అఖండనామ సంకీర్తన మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో లక్ష్మణరావు పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు మరింతగా విస్తరిస్తున్నామన్నారు. వంద గంటల అఖండనామ సంకీర్తనను విజయవంతం చేసిన వారికి అభినందించారు. సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు ఎస్.రామచంద్రరావు, జిల్లా సేవాదళ్ కో ఆర్డినేటర్ పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

సరుబుజ్జిలి: గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు భాగస్వామం కావాలని ఎంపీడీఓ ఎం.పావని అన్నారు. 100 రోజుల ప్రణాళికలపై రెండు రోజులుగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్ల శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. పంచాయతీ పరిపాలనపై అవగాహన కల్పించారు.

నరసన్నపేట: సమాజంలో ఆడపిల్లల స్వీయ రక్షణకు కల్పిస్తూ వారి హక్కులను కాపాడదామని, దీనికి ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలవాలని ఐసీడీఎస్ పీఓ నాగమణి, సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ వై.హిమబిందు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన వార్డు సభ్యులు, వైస్ సర్పంచ్‌ల శిక్షణ శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. మహిళల రక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఆమదాలవలస: గ్రామ పంచాయతీ అభివృద్ధిలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు భాగస్వామం కావాలని ఎంపీడీఓ రోణంకి వెంకటరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రెండు రోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పంచాయతీల అభివృద్ధికి పాలకులు, అధికారులు కలిసి పనిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

బూర్జ: పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళలు, వృద్ధుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి బాధితులకు చట్ట పరిధిలో న్యాయం చేకూర్చాలని ఎస్పీ కె.వి మహేశ్వరరెడ్డి ఆదేశించారు. మంగళవారం బూర్జ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రిసెప్షన్ కేంద్రం, రికార్డుల నిర్వహణ, ప్రోపర్టీ భద్రపర్చే గదులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సమస్యలను ఎస్ఐ ఎం.ప్రవల్లికను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమైన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలన్నారు.



పాతపట్నం: అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: శ్రీమహాలక్ష్మీదేవిగా దర్శమిచ్చిన నీలమణిదుర్గమ్మ

● మహాలక్ష్మీదేవిగా...

దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిరమండలంలోని పెద్దకోరాడలో గల పాతపట్నం నీలమణిదుర్గమ్మ శ్రీమహాలక్ష్మీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. జలుమూరు మండలం శ్రీముఖలింగంలోని వారాహి అమ్మవారు లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. సారవకోట మండలంలోని అవలింగి నీలమణి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేపట్టారు.

- సాక్షి నెట్‌వర్క్

ప్రమాణ స్వీకారానికి తరలిరండి

కొత్తూరు: నరసన్నపేటలో ఈ నెల 10 తేదీన వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించనున్న ప్రమాణ స్వీకారానికి కొత్తూరు మండలం నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని పార్టీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు కోరారు. కొత్తూరులో మంగళవారం శ్రీనివాసరావు మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ధర్మాన కృష్ణదాస్, శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకునిగా తమ్మినేని సీతారాం, డాక్టర్స్ విభాగం రాష్ట్ర కనీ్వనర్‌గా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు అప్పగించిన పదవులకు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ప్రమాణ స్వీకారానికి హాజరయ్యేవారు పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి క్యాంపు కార్యాలయానికి చేరుకోవాలన్నారు. అక్కడ నుంచి రెడ్డి శాంతి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లడం జరుగుతుందన్నారు.

7 దుకాణాలకు 114 దరఖాస్తులు

కొత్తూరు: స్థానిక ఎక్సై జ్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు, హిరమండలంలో ఉన్న ఏడు మద్యం దుకాణాలకు మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో 114 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ మణీశ్వరి తెలిపారు. ఈ నెల 9 తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్ట్

పొందూరు: మండలంలోని కృష్ణాపురం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జూద శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. నగదును, ద్విచక్రవాహనాలను పట్టుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. వీరి నుంచి సుమారు రూ.1 లక్ష 6 వేల 8 వందలతోపాటు 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: బడివానిపేట గ్రామానికి చెందిన బడి రవి అనే వ్యక్తిపై ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు మంగళవారం నమోదైంది. రవి, ఆయన కుటుంబ సభ్యులు నలుగురిపై భార్య చల్ల నిషిత ఫిర్యాదు చేసింది. అట్రాసిటీ, గృహ హింస, వరకట్న వేధింపులు వంటి సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ దృష్టికి కేసు తీసుకువెళ్లినట్లు ఎస్: వి.సందీప్‌కుమార్ తెలిపారు. నిబంధనల మేరకు ఈ కేసును డీఎస్పీ స్థాయి అధికారి దర్యాప్తు చేయావల్సి ఉంటుంది.

రీ సర్వే అక్రమాలపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న ప్రసాదరావు, రైతులు

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ గ్రామంలో భూముల రీ సర్వేలో జరిగిన అక్రమాలపై తహసీల్దార్ రవిచంద్రకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు ఆధ్వర్యంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. రీ సర్వేలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వేలో భూముల వివరాలు తప్పుగా నమోదు చేయడం వల్ల అన్ని హక్కులు ఉన్న భూ యజమానులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులు కె.సురేష్‌నాయుడు, పి.యతిరాజు, జి.కృష్ణారావు, చలపతిరావు, కె.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో వైఫల్యం
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో నిత్యావసర సరుకులతో పాటు బియ్యం, కూరగాయల ధరలు మండిపోతున్నాయని, ధరలు నియంత్రించటంలో చంద్రబాబు ప్రభుత్వం వైఫల్యం చెందిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. పాతపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కేవలం నాలుగు నెలల పాలనలో దారుణంగా ధరలు పెరిగాయన్నారు. పేదరిక నిర్మూలన చేస్తామని చెప్పిన చంద్రబాబు.. ధరలు పెంచి మరింత పేదరికం అంటగట్టారని విమర్శించారు. పేదరిక నిర్మూలన అంటే చంద్రబాబు దృష్టిలో ధరలు పెంచటమేనా? అని ప్రశ్నించారు. దసరా పండగ సమయంలో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని నిలదీశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లేకపోవటంతో కాలేజీ యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయన్నారు. మహిళల కోసం ప్రకటించిన ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, నెలకు రూ.1500, తల్లికి వందనం ఈ నాలుగు పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో వెంటనే ప్రకటించాలన్నారు. ఖరీఫ్ సీజన్ పూర్తయిందని, అయినా ఇప్పటివరకు అన్నదాత సుఖీభవ పథకం ఎందుకు చెల్లించటం లేదని ప్రశ్నించారు. ఇసుక ఉచితం అని అక్రమంగా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడులతో కలిసి పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఇసుక అక్రమ వ్యాపారానికి, ప్రభుత్వ భూములు అక్రమించుకునేందుకు సిద్ధం అయ్యారన్నారు. జగనన్న పాలనలో అన్ని పథకాల డబ్బులు సకాలంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యేవని గుర్తు చేశారు.

చేపల పెంపకంలో.. సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

ఆమదాలవలస: చేపల పెంపకంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని నాబార్డ్ డీజీఎం రమేష్ అన్నారు. మంగళవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. జిల్లాలోని మత్స్యకారులు, చేపల పెంపకందారులు సంఘటితంగా ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పాటైతే వారికి నాబార్డు ద్వారా అమలవుతున్న పథకాలు అందిపుచ్చుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కూడా ఏర్పడుతుందన్నారు. చేపల పెంపకంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. మత్స్యకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సి.హెచ్.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో మేలు



సెంచూరియన్ వర్సిటీ ప్రొఫెసర్లు, విద్యార్థులు

మెళియాపుట్టి: వ్యవసాయంలో మెలకువలు పాటించాలని పర్లాఖిమిడి (ఒడిశా) సెంచూరియన్ వర్సిటీ ప్రొఫెసర్లు, విద్యార్థులు అన్నారు. మంగళవారం మండలంలోని చాపర గ్రామంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ప్రదర్శించి ఉపయోగాలు తెలియజేశారు. డిజిటల్ వ్యవసాయం ఎంతో మేలని 'నా పంట' యాప్ ఉపయోగాలను వివరిస్తూ.. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు పండించే పంటల ధరలు, వాతావరణ సూచనలు, తెగుళ్లకు నివారణ పద్ధతులు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చున్నారు. దగ్గరలో ఉన్న ఎరువులు, విత్తనాల డీలర్ల వివరాలు సైతం ఉంటాయని, వారితో నేరుగా మాట్లాడే అవకాశం ఉందన్నారు. రైతు సమస్యలకు పరిష్కార మార్గాలు, సూచనలు ఇవ్వడానికి ఇందులో నిపుణుల వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రొఫెసర్లు, వైద్యులు సలాన శరత్, సర్పంచ్ రామారావు, రైతులు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలి



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

ఆమదాలవలస: అంగన్‌వాడీలపై పని భారం తగ్గించాలని ఆ యూనియన్ నాయకులు పి.భూలక్ష్మి, పి.లతాదేవి ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ ఎస్.అనురాధకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు తీసుకువచ్చిన యాప్‌లన్నీ ఒకే యాప్‌గా మార్చాలన్నారు. రికార్డు వర్క్‌ను తగ్గించాలని, ఏడు నెలల వయస్సు గల పిల్లల నుంచి ఆరు ఏళ్ల లోపువారికి ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరారు. ఐదు రకాల రికార్డులను రాయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని, ఒక్కొక్క కార్యకర్తకు రూ.1,200 ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు పి.లక్ష్మి, డి.అరుణ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పాతపట్నం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా బి.వెంకటరమణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన హిరమండలం మండలం తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన డీటీ బి.ప్రసాదరావు ఇదే కార్యాలయంలో సీఎస్‌డీటీగా పనిచేస్తున్నారు. ఎలక్షన్ డీటీగా వాన శంకరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మెళియపుట్టి డీటీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎలక్షన్ డీటీ శైలజ శ్రీకాకుళం కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. సీనియర్ అసిస్టెంట్‌గా ఎం.వైకుంఠరావు బాధ్యతలు చేపట్టారు. ఈయన మెళియాపుట్టి మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన సీనియర్ అసిస్టెంట్ జగన్మోహన్‌రావు మెళియపుట్టి తహసీల్దార్ కార్యాలయం సినియర్ అసిస్టెంట్‌గా బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ముగ్గురు అధికారులకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.